

వ్యాకులమాత యాత్రకు గట్టి బందోబస్తు

ప్రజాశక్తి-కొత్తవలస

ఈనెల 5 నుంచి రెండు రోజులు పాటు జరిగే వ్యాకుల మాత జాతరకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ బాల సూర్యరావు తెలిపారు. ఈ జాతర ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. బందోబస్తులో సిఐ ముగ్గురు, ఎస్ఐలు 16 మంది, ఏఎస్ఐలు 60 మంది,పీసీలు 128 మంది, 68మంది హోం గార్డులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరోవైపు వ్యాకుల మాత పుణ్యక్షేత్రం యాత్ర మహోత్సవం నవీనా ప్రార్థనలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెవ.ఫా.ప్రతాప్ ప్రసంగించారు.



ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పూసపాటిరేగలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రత్యేక హోదా సమరయాత్రకు
ఘన స్వాగతం



విజయనగరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, పూసపాటిరేగ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై హిందూపూర్ నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర చేపట్టిన నాయకులకు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బాలాజీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మంది విద్యార్థులు, యువజనులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, విశాఖ ఉక్కును అమ్మేసినా, కేంద్ర గిరిజన విద్యాలయానికి నిధులు కేటాయించక పోయినా సరే ఇక్కడున్న వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పట్టించుకోడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పరిశ్రమలు, రైల్వేజోన్, నీటి ప్రాజెక్టులు పెట్టి ప్రజలను ఆదుకుంటామన్నారని, ఆ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. హోదా సాధనకు విద్యార్థులు, యువజనులు చేపట్టే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చలో పార్లమెంట్‌కు తరలిరండి

ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధనకై చలో పార్లమెంటు ముట్టడికి విద్యార్థులంతా తరలిరావాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పూసపాటిరేగ చేరుకున్న సమరయాత్ర నాయకులకు విద్యార్థులు స్వాగతంపలికారు. అనంతరం ఎస్‌విఎస్ఆర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి,యువజన సంఘాలు చేస్తున్న సమరయాత్రతో రాజకీయ నాయకులు కళ్లు తెరవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని, డి వైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.లెనిన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, నాగభూషణం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాలో కళాతపస్వి అడుగులు

జిల్లాతో కె.విశ్వనాథ్‌కు ఎనలేని అనుబంధం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రముఖ దర్శకుడు కళాతపస్వీ కె.విశ్వనాథ్‌కు ఉమ్మడి విజయనగరం జిల్లాతో ఎనలేని అనుబంధం ఉంది. ఈనేపథ్యంలో ఆయన కన్నుమూశారని తెలుసుకున్న జిల్లావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విశ్వనాథ్ జిల్లాకు వచ్చినప్పటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకొని నివాళు లర్పించారు. సంగీతం, సాహిత్యంతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాన్ని మేళవించి తెలుగు సినిమాకు పునర్జీవం పోశారని కొనియాడారు.



గీతా నృత్య కళాశాల వార్షికోత్సవానికి హాజరైన కె.విశ్వనాథ్‌కు జ్ఞాపికను అందిస్తున్న కమల్‌హాసన్, నిర్వాహకులు

శుభసంకల్పం సినిమా విజయనగర పరిసర ప్రాంతాల్లో 1994 లో చిత్రీకరణ చేసినపుడు డి.వై.సంపత్ కుమార్ శిక్షణలో ఆంధ్ర జాలరి నృత్యాన్ని కమల్ హాసన్‌తో చిత్రీకరించారు. ఆ సమయం లో సంపత్ కుమార్ హస్తబల్ హాల్ లో నిర్వహించిన సత్కార సభలో పాల్గొన్నారు. 1995లో గీతా నృత్య కళాశాల వార్షికోత్సవంలో సినీనటుడు కమల్‌హాసన్‌తో కలిసి విశ్వనాథ్ పాల్గొన్నారు. 2003లో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ విశిష్ట పురస్కారాన్ని కళాతపస్వి విశ్వనాథ్ విజయ నగరంలోని గురజాడ కళాభారతిలో అందుకున్నారు. ఆ సందర్భంగా ముఖ్యవక్తగా ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం కూడా విచ్చేశారు.




గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందుకునేందుకు విజయనగరం విచ్చేసిన కె.విశ్వనాథ్


ఆయనతో ఆత్మీయ అనుబంధం ఏర్పడిన కాపుగంటి ప్రకాష్ ఇద్దరు కుమార్తెల వివాహాలకు ప్రత్యేకంగా విశ్వనాథ్ విచ్చేశారు. ఆత్రేయ స్మారక కళాపీఠం అధ్యక్షులు ఉసిరికల చంద్ర శేఖర్ షష్టిపూర్తి కార్యక్రమానికి వేటూరి గారితో కలసి విచ్చేసారు. 2006లో విజయనగరం కొత్తగ్రహారం శివ్వా నానాజీ ఇంట్లో ఉండి బాబామెట్ట లో సంప్రదాయ వైద్యులు రజనీ కాంత్‌తో విశ్వనాథ్ మోకాళ్ళ నొప్పులకు15 రోజుల పాటు చికిత్స పొందారు. ఆ సమయంలో ఆనంద గజపతి కళాక్షేత్రంలో విజయనగరానికి చెందిన యువ గాయనీ గాయకులతో ఏర్పాటు చేసిన సంగీత విభావరిలో పాల్గొన్నారు. తన జీవితంలో అది మరచిపోలేని రోజు అని ఆయన అన్నారు. 2010 సంవత్సరంలో శుభప్రదం సినిమా చిత్ర బృందం తో విజయనగరం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్దికాలం క్రితం సన్ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన సందర్భం లో రామనారాయణ ప్రాంగణాన్ని దర్శించారు.


కళాతపస్వి సినిమాలు విలువల వేదాలు

విశ్వనాథ్ మృతి తెలుగు సినీ రంగానికి, తెలుగు ప్రేక్షకులకు తీరనిలోటు అని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. 2017లో విశ్వనాథ్ సినీ జీవిత విశేషాలపై నేను రాసిన కళాతపస్వి అనే పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన కిన్నెర పబ్లికేషన్స్ ప్రచురించింది. ఆఏడాది ఫిబ్రవరి 19న విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన స్వగృహంలో ఆవిష్కరించారని తెలిపారు. విజయనగరంలోని తోటపాలేనికి చెందిన ప్రముఖ చిత్ర కళాకారిణి సిరిపురపు ప్రవల్లిక 2009లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విశ్వనాథ్ చేతుల మీదుగా సంకల్ప్ బాల మేధావి పురస్కారాన్ని అందుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను ఆమె గుర్తు చేస్తూ విశ్వనాథ్ చేతుల మీదుగా పురస్కారం పొందడం తన పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌కు చిత్ర నీరాజనాన్ని అందించారు.



కళాతపస్వికి నివాళులర్పిస్తూ చిత్రకారిణి ప్రవల్లిక గీసిన చిత్రం





చెవులు, ముక్కు తొలగించిన విగ్రహాలు

మహనీయుల విగ్రహాలు ధ్వంసం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దేశ నాయకుల విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద విగ్రహాలతోపాటు మరి కొంత మంది నాయకుల విగ్రహాలకు చెవులు, ముక్కులు, చేయి తదితర శరీర భాగాలను ధ్వంసం చేశారు. ఈ పాఠశాలలో సాయంత్రం నుంచి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై హెచ్‌ఎం సిహెచ్ లక్ష్మీనారాయణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు ముగ్గురితో బృందం ఏర్పాటు చేసి దుండగులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

దేశ నాయకుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.జయరాం డిమాండ్ చేశారు. ఆ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. వీరితోపాటు కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డి.గురుమూర్తి, సమతాసైనిక్ దళ్ మండల అధ్యక్షులు తేగల మోహన్ ఉన్నారు.

విదేశీ విద్యాదీవెన విద్యార్థుల పాలిట వరం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- ఇద్దరికి రూ.20.24 లక్షల సాయం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన విదేశీ విద్యాదీవెన పథకం విద్యార్థుల పాలిట వరమని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఇలాంటి విద్యా సంబంధిత పథకాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విదేశీ విద్యా సంస్థల్లో చదువుకోవాలనే కోరిక ఉన్నవారికి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా నుంచి ప్రస్తుతానికి ఇద్దరు ఎంపికయ్యారని వారికి ప్రభుత్వం రూ.20.24 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది ఈ పథకంలో చేరి ఆర్థిక సాయాన్ని పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. రూ.8 లక్షల వార్షిక ఆదాయం లోపు కలిగిన విద్యార్థులు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణ సదుపాయాలను కూడా వినియోగించుకోవాలని, సంబంధిత వివరాలను ఎల్.డి.ఎం.కు అందజేయాలని సూచించారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించగా కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్ సూర్యకుమారి, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, డిసిఎంఎస్ ఛైర్ పర్సన్ అవనాపు భావన, డిసిసిబి ఛైర్మన్ రామునాయుడు, సోషల్ వెల్ఫేర్ డిడి రత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు లబ్ధిపొందారని వివరించారు. వంగర మండలం సంగం గ్రామానికి చెందిన బొడ్రోతు శైలజ యుఎస్ఎలోని యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో పీజీ కోర్సు జాయిన్ అయ్యిందని ఆమె సౌకర్యార్థం రూ.13,99,154ను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. కొత్తవలస పరిధి మంగళపాలెం గ్రామానికి చెందిన ఎల్లపు సందీప్ ప్రకాష్‌రాజు యూకెలోని యూనివర్శిటీ ఆఫ్ లివర్‌పూల్ లో ఎమ్మెస్సీ అడ్వాన్స్‌డ్ మెకానిక్ ఇంజనీరింగ్ కోర్సు జాయిన్ అవ్వగా ప్రభుత్వం రూ.6,25,012 లను మంజూరు చేసిందని వెల్లడించారు. అనంతరం సంబంధిత నమూనా చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు.

సీజ్ చేసిన వాహనాలను వేలం వేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నాటుసారా, మద్యం అక్రమ రవాణకు పాల్పడుతూ పట్టుబడిన వాహనాలను నిబంధనలు మేరకు వేలం వెయ్యాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ మద్యం, నాటుసారా అక్రమ రవాణకు పాల్పడుతూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కేసుల్లో, స్వాధీనం చేసుకున్న వాహనాలను నిబంధనలు మేరకు వేలం వేయాలని ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషను పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే స్వాధీనం చేసుకున్న 191 వాహనాల యజమానులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులు, ప్రజలకు గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించి, మత్తు పదార్థాలకు దూరం ఉండాలని కోరుతూ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టాలన్నారు. మహిళా పోలీసులు, సెబ్, పోలీసు అధికారులు, వైద్యులతో వారికి కౌన్సిలింగు నిర్వహించాలన్నారు. ఎస్ఇబి. జాయింట్ డైరెక్టర్ అష్మ ఫర్ హీన్ మాట్లాడుతూ – వివిధ పోలీసు స్టేషనులో నమోదైన కేసులను, సీజ్ చేసిన వాహనాలను సమీక్షించారు. 2వ పట్టణ సిఐ సిహెచ్ లక్ష్మణరావు, రాజాం సిఐ కె.రవికుమార్, బొబ్బిలి సిఐ ఎం. నాగేశ్వరరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మనస్తత్వాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి

ఇఎండిపి జోనల్ మేనేజర్ అగ్ని హోత్ర శర్మ

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్ఇఆర్‌టి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంట్రెప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు సృజనాత్మక నైపుణ్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని ఇఎండిపి జోనల్ మేనేజర్ ఒ.అగ్ని హోత్ర శర్మ విద్యార్థులకు సూచించారు శుక్రవారం మదనాపురం ఎపి మోడల్ స్కూల్ ను జిల్లా మేనేజర్ కె.నరేష్ తో కలిసి సందర్శించిన ఆయన పాఠశాలలో జరుగుతున్న ఇఎండిపి ప్రోగ్రాం ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రామకృష్ణారావు మాట్లాడుతూ ఇఎండిపి ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం, మార్చిలో జరగబోయే ప్రాజెక్టు ఎక్స్‌పో గురించి విద్యార్థులకు వివరించారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అంగన్ వాడీ కేంద్రాల ద్వారా, పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఎస్.కోటలో పర్యటించారు. అంగన్ వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, పాఠశాలలను సందర్శించారు. ఆహార సంబంధిత పథకాల అమలు తీరును పర్యవేక్షించారు. దీనిలో భాగంగా స్థానిక అంగన్ వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ హాజరు పట్టికలో దిద్దుబాట్లు ఉండటంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు

ఎం.ఎల్.ఎస్. పాయింట్ల ద్వారా ఎండియు వాహనాలకు అందిస్తున్న రేషన్ సరకుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. పర్యటనలో భాగంగా ఆయన ఎస్. కోటలోని జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కావ్యారెడ్డి ఉన్నారు.

ముఖ ఆధారిత హాజరు నిలిపేయాలని..
నగర పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ కార్మికులకు ముఖ ఆధారిత హాజరు నిలుపుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వద్ద స్మార్ట్ ఫోన్లు ఉండవని, ఒక వేళ ఉన్నా సరే వినియోగించే పరిస్థితి ఉండదని తెలిపారు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తే వ్యక్తిగత సమాచారానికి భంగం వాటిల్లుతుందని చెప్పారు. సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలు తీసుకువస్తున్నారన్నారు. 2020లో సమ్మె సందర్భంగా ఇస్తామన్న జీతాలు ఇంతవరకు ఇవ్వకుండా తాత్సారం చేయడం దారుణమన్నారు. జనవరి నెల జీతాలు, హెల్త్ అలవెన్స్, ఇంతవరకు ఇవ్వలేదని చెప్పారు. సబ్బులు, నూనెలు, చీపుర్లు విజయనగరం కార్పొరేషన్‌లో ఇచ్చారు గాని నగర పంచాయతీలో నేటికీ అందించలేదన్నారు. పుష్ గార్డులు మరమ్మతులు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి బి.రమణ, నాయకులు టి.బాబూరావు, జె.శ్రీనివాస్, బి.రమణ, టి.శశి రేఖ, బి.హరిబాబు, జె.గౌరి తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. ధర్నా చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

పోరాటాలకు సిద్ధం కావాలి

వంగర : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు పిలుపునిచ్చారు. రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు మరణిస్తే వారి స్థానంలో కొత్త కార్మికుల్ని నియమించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని చెప్పారు. ఆ స్థానంలో వారసులను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు రాజేష్, శంకర్రావు, గిరి, కృష్ణ, చినబాబు, గోపి, కనకరాజు, రవి, రఘు, లక్ష్మి, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం : భూముల రీ సర్వే ప్రక్రియను వేగాన్ని పెంచాలని తహశీల్దార్లను కలెక్టర్ సూర్యకుమారి ఆదేశించారు. రైతులకు రీ సర్వేపై అవగాహన కలిగించాలని అన్నారు. పక్కా పాస్ బుక్ కలిగి ఉన్నప్పటికీ రీ వెరిఫికేషన్ చేయించుకోవడం వలన రైతుకే మేలు జరుగుతుందని తెలిపారు. రైతు ఉన్నా లేకపోయినా కొలతలు ఖచ్చితంగానే ఉంటాయని చెబుతూ రైతు సమక్షంలో సర్వే జరిగితే క్లియర్ టైటిల్ డీడ్ పొందగలరని రైతులకు చెప్పాలన్నారు. ఎక్కువగా సర్వేయర్లు ఉన్న చోట నుండి డిప్యుటేషన్ వేయాలని ఆర్‌డిఒకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో విజయనగరం డివిజన్ కు సంబంధించి సుస్థిర అభివృద్ధి సూచీలు, రీ సర్వే తదితర అంశాల పై కలెక్టర్ సమీక్షించారు. రీ సర్వే నెమ్మదిగా జరుగుతున్న మండలాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో రోజుకు కనీసం వంద ఎకరాలకు తగ్గకుండా, సగటున 150 ఎకరాలు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

రక్త హీనత నివారించండి

మండలాల వారీగా పిల్లలు, విద్యార్థులు, మహిళలకు నిర్వహించిన రక్త పరీక్షలపై కలెక్టర్ ఆరా తీశారు. రక్త హీనత ఉన్న వారిని గుర్తించి, వారు దానినుంచి బయట పడేవిధంగా కౌన్సిలింగ్ నిర్వహించి, పోషకాహారం, అవసరమైన మందులను అందించాలని సూచించారు. రక్త హీనతను తగ్గించడంలో స్త్రీ,శిశు సంక్షేమ అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సూర్యకళ , సిపిఒ మురళి, డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఎస్‌డిసి సూర్య నారాయణ, సర్వే శాఖ ఎడి త్రివిక్రమరావు పాల్గొన్నారు.

నేడు పిసిసి అధ్యక్షులు రుద్రరాజు రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజలందరికీ తెలియజేస్తామని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తారని, విభజన హామీలను నెరవేరుస్తారని తెలిపారు. ఈ విషయాలను ప్రజలకు వివరించేందుకు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి ఎత్తి బ్రిడ్జి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు, అక్కడి నుంచి బాలాజీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపడతామని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో శ్రీకరిణికి స్వర్ణ పతకం

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

గతనెల 29, 30, 31 తేదీలలో అనకాపల్లిలో జరిగిన ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మొకర రేణుకా శ్రీకరిణి రెండు స్వర్ణ పతకాలను సాధించి రాష్ట్ర స్థాయిలో 'బెస్ట్ ప్లేయర్' అవార్డు ను సొంతం చేసుకుంది. క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాలలో ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయనగరం జిల్లా 167 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించింది. గతం లో కుడా జాతీయ స్థాయిలో రేణుకా ఎన్నో స్వర్ణపతకాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తెచ్చింది. ఈసందర్భంగా ఆమెకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయండి

ప్రజాశక్తి-వంగర

మండలంలో నూతనంగా మంజూరైన ఇళ్లకు త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేయాలని చీపురుపల్లి గృహ నిర్మాణ శాఖ ఇఇ జి.గౌరీ శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగర మండలానికి సంబంధించి నూతనంగా 1745 గృహాలు, మరో 226 లేఅవుట్ల మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్, నాయకులు కరణం సుదర్శనరావు, హౌసింగ్ ఎఇ పైడితల్లి పాల్గొన్నారు.

కేన్సర్ పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కేన్సర్ నుంచి ఉపశమనం పొందడం ఎలా అనే అంశంపై కేన్సర్ రిలీఫ్ ఇండియా సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ గిల్లి బర్న్ వివరించారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారిలో మానసిక స్థైర్యం నింపాలన్నారు. అనంతరం రేడియోలజీ విద్యార్థి అర్జీత్ బెనర్జీని సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డి. ఎన్. రాజు, సుప్రజ, సత్య ప్రతినిధులను విసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ, డీన్ కృష్ణమూర్తి, డీన్ డాక్టర్ ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, విభాగాధిపతులు శ్రావణి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న గ్రామ వాలంటీర్

ప్రజాశక్తి-వేపాడ


పింఛను నగదు అందిస్తున్న వాలంటీర్ శివ

జాకేరు గ్రామానికి చెందిన బుద్ద అప్పయమ్మ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తగరపువలసలో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వాలంటీరు గనివాడ శివ.. సొంత ఛార్జీలతో అక్కడికి చేరుకుని పింఛను మొత్తాన్ని ఆమెకు అందజేశారు. శివ చేసిన సేవకు గ్రామస్తులు అభినందించారు.

హిండెన్‌బర్గ్ నివేదికపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదికపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయాలని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. బొబ్బిలి పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను అదానీ గ్రూపు నాశనం చేస్తోందన్నారు. బ్యాంకులు, ఎల్‌ఐసిని అదానీ లూటీ చేస్తున్నారన్నారు. అదానీ అక్రమాలకు ప్రధానమంత్రి మోడీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చోళ్లంగిపేటలో పెరటికోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామంలోని మహిళా సంఘం సభ్యురాలు గుడివాడ రమణమ్మ కోడి పిల్లలను కొనుగోలు చేసి, 90 రోజులపాటు ఒక్కో కోడి 1100 గ్రాముల బరువు వచ్చే వరకు పెంచారు. ఇలా పెంచిన 50 పెరటికోళ్ల యూనిట్లను మండలంలోని మహిళలకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చోళ్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపిటిసి గుడివాడ కిరణ్, రామతీర్థం బోర్డు సభ్యులు దాట్ల సత్యనారాయణరాజు, డి.కొల్లాం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, మాజీ సర్పంచ్ తొత్తడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


జిరాయతీలో కాలువ తవ్వొద్దని వినతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తమ జిరాయతీ భూమిలో కాలువ తవ్వకం ఆపించాలని కందివలసకు చెందిన బాడిత వెంకటరావు, పులపా సత్యనారాయణ శుక్రవారం ఎంపిడిఒ జి.రామారావు, తహశీల్దార్ బాస్కరావును కలిసి వినతి ఇచ్చారు. కందివలస రెవెన్యూలో సర్వే నంబర్ 10/19, 20, 40, 41, 9/6, 7లో తమ జిరాయతీ మెట్ట, పల్లపు భూములున్నాయని వారు తెలిపారు. సర్వే నంబర్ 10/20లో జిరాయతీలో సర్పంచ్ డి.గణేష్ దౌర్జన్యంగా కాలువ తవ్వేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం కాలువ తవ్వేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. ఈ భూమిపై నుంచి ఏవిధమైన కాలువలు గాని, రస్తా గాని రికార్డు పరంగా లేవన్నారు. అయితే సర్వే నంబర్ 10/19లోని భూమిపై సివిల్ జడ్జి కోర్టులో ఇంజక్షన్ దావా ఉందన్నారు. కాలువ తవ్వకం ఆపించాలని కోరారు. వారితోపాటు పిడుగు బంగార్రాజు, పిడుగు కృష్ణ, పులపా త్రినాథరావు ఉన్నారు.

'సాధన' మానవత్వం

ప్రజాశక్తి-నెల్లిమర్ల


రక్తదానం చేస్తున్న విజయకుమార్

అత్యవసర సమయంలో స్పందించిన సాధన యువజన సంఘం మానవత్వాన్ని చాటుకుంది. కురుపాం గ్రామానికి చెందిన సంధ్య అనే గర్భిణి పార్వతీపురంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఒ-నెగెటివ్ రక్తం అవసరం కాగా, విజయనగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించారు. వెంటనే జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్ స్పందించారు. ఆయన చొరవతో కళ్లా విజయకుమార్ ఏడోసారి రక్తదానం చేశారు. వీరిని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి ఎం.రామారావు, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎం.రాము, డి.గౌరీ శంకర్, వి.సత్యారాం, ఎం.శ్రీదేవి, రెడ్‌క్రాస్ వాలంటీర్ ఎ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థలో సామగ్రి కొనుగోలుకు కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్ర గ్రంథాలయం, గ్రామీణ గ్రంథాలయాల నిర్వహణ నిమిత్తం అవసరమైన సామాగ్రి కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపిందని, ఆసక్తి కలిగిన సరఫరాదారుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్. లలిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫర్నీచర్, జెరాక్స్ మెషీన్లు, ప్రింటింగ్ రిజిస్టర్లు సరఫరా చేసేందుకు ముందుకొచ్చే వారు www.apeprocurement.gov.in వెబ్ సైట్ ద్వారా ఇ-టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. వివరాలను ఈనెల 4 నుంచి పది రోజుల పాటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

కేన్సర్ వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రేగిడి

రాజాంలోని అమృత ఆస్పత్రిలో శనివారం వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అమృత హాస్పిటల్ వైద్యులు గార రవి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ కేన్సర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ విజయ ఆదిత్య యాదరాజు సుమారు 100 మందికి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో పారా మెడికల్ సిబ్బంది సేవలందించారు.

గంగచోళ్లపెంటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో శుక్రవారం మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి, డాక్టర్ వేలంగిణి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం, పాఠశాలలు, అంగన్వాడీలను సందర్శించి 72 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, 104 సిబ్బంది, ఎఎన్‌ఎం, ఆశ, డిఇఒ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా పథకాలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ


మెంటాడ.. మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో గృహసారథులను నియమించినట్లు డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర తెలిపారు. శుక్రవారం మండలంలో చల్లపేట గ్రామంలో ఏర్పాటు చేసిన గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సహాయంతో ఈ నెల 11 నుంచి గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సహాయాన్ని, సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. అందుకు సంబంధించిన ప్రసార మెటీరియల్ పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, జెడ్‌పిటిసి లెంక సన్యాసి అప్పలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, వైసిపి నాయకులు రెడ్డి రాజు అప్పలనాయుడు, పోరిపిరెడ్డి అప్పలనాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

గజపతినగరం : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే పార్టీకి, ప్రజలకు వారధులని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ బొత్స అప్పలనర్సయ్య అన్నారు శుక్రవారం పార్టీ కార్యాలయ ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహ రథసారథులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ గల నాయకులు, కార్యకర్తలు ఉన్న ఈ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ సత్తాచూపాలని అన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలన్నారు. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకొని వారితో మమేకం కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, పల్లి సంజీవరావు, సామంతుల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జామి : సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జామిలోని జెఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని వారికి ఇంకా ఏమి అవసరం తెలుసుకోవాల్సి ఉందన్నారు. పేదల కళ్లలో సంతోషమే ధ్యేయంగా జగనన్న పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, జెడ్‌పిటిసి జి.సరయు, వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, స్టేట్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సత్యారావు, మాజీ ఎంపిపి సూరిబాబు రాజు, వైస్ ఎంపిపిలు గేదెల వెంకటరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు చేరువలో ఎంసి సేవలు

ఎంసి పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులకు చేరువలో ఎఎంసి సేవలు అందించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. మార్కెట్ యార్డు కార్యాలయంలో శుక్రవారం ఎఎంసి పాలకవర్గం సమావేశం జరిగింది. శంబంగి మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి పని చేయాలన్నారు. పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ బొబ్బిలిలో రైతు బజారు నిర్మించేందుకు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పని చేస్తామన్నారు. రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై బహిరంగ చర్చకు రావాలి

రైతుల సమస్యలపై బహిరంగంగా చర్చించేందుకు రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సవాల్ విసిరారు. మార్కెట్ యార్డులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎన్నికల హామీలను అమలు చేసి రైతులు పండించే పంటలకు మద్దతుధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి అమలు చేయలేదన్నారు. టిడిపి హయాంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినా బిల్లులు చెల్లించలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.98 వేల కోట్లు ధాన్యం రైతులకు చెల్లించినట్లు చెప్పారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తే, తప్పుడు ప్రచారం చేయడం అన్యాయమన్నారు. బేబినాయన జమిందారు తప్ప రైతు కాదన్నారు. రైతాంగ సమస్యలపై చర్చించేందుకు తాను సిద్ధమని, కోట సెంటర్‌లో చర్చకు రావాలని బేబినాయనకు సవాల్ విసిరారు.


సమావేశమైన ఎంసి పాలకవర్గ సభ్యులు

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తాహశీల్దార్ రమణ రాజు, ఎంపిడిఒ జి.గిరిబాల, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ నీలకంఠ రావు పాల్గొన్నారు.

డిజిటల్ కరెన్సీపై సెమినార్

ప్రజాశక్తి-డెంకాడ

ఎంవిజిఆర్ కళాశాలలో ఎంబిఎ విద్యార్థులకు శుక్రవారం 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ'పై సెమినార్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విజయనగరం లెర్నింగ్ సెంటర్ ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సి.హెచ్ సూర్య ప్రకాశ్ మాట్లాడుతూ డిజిటల్ కరెన్సీ గురించి వివరించారు. చట్టబద్ధమైన టెండర్‌ను 'ఫియాట్ కరెన్సీ'గా జారీ చేయడం, క్రిప్టో కరెన్సీకి డిజిటల్ కరెన్సీ ఎలా భిన్నంగా ఉంటుందో కూడా వివరించారు. ప్రత్యక్ష ఉదాహరణలను అందించి విద్యార్థులను చర్చా వేదికలో పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబిఎ హెచ్‌ఒడి డాక్టర్ సన్యాసిరాజు, వియస్‌ఎం శ్రీనివాస్, టి.సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని జాకేరు, వేపాడ, వావిలపాడు, ఎంకెఆర్‌పురం, సోంపురం, బొద్దాం పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే కంబాల జోగులు


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి : సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు.. శుక్రవారం సోమరాజుపేటలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం, మిల్క్ బల్క్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల్లో అర్హులైన వారందరూ 972 సర్వీసులను వినియోగించుకోవాలన్నారు.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేయని సంక్షేమ పథకాలు తాము అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబఖండి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్రావు, వైసిపి నాయకులు నెల్లి పెంటన్నాయుడు, కెంబూరు వెంకటేశ్వరరావు , లెంక రాంబాబు, రమేష్ నాయుడు, పాలవలస కరణం శ్రీనివాసరావు, అప్పలనాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, జెఇ రామకృష్ణ, బూరాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.భార్గవి పాల్గొన్నారు.

సఖి గ్రూపులతో బాలికల సాధికారత

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములు నాయుడు

బాలికల సాధికారతకు సఖి గ్రూపులు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బిపిఎం పాఠశాలలో బాలికలతో సమావేశం నిర్వహించి, సఖి గ్రూపుల అవసరం, ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సఖి గ్రూపులో 9 నుండి 21 సంవత్సరాల బాలికలు సభ్యులుగా సచివాలయ పరిధిలో ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి మరియు హెల్త్ కార్యదర్శి ఆధ్వర్యంలో సఖి గ్రూపులు నిర్వహణ జరుగుతుందన్నారు. వీరితోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు ఒక గ్రూపుగా ఏర్పడి స్నేహపూర్వక వాతావరణంలో బాలికలతో సత్సంబంధాలను ఏర్పర్చుకోవాలన్నారు. తద్వారా సంక్లిష్టమైన సమస్యలను కూడా సావధానంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. బాలికలలో ఏర్పడే ఆరోగ్య సమస్యలు, పౌష్టికాహార జాగ్రత్తలు, లైంగిక వేధింపులు వంటి విషయాలపై సమగ్రంగా చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా. సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ పొదుపు ఖాతా

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న 10 నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు ఎస్‌బిఐలో పొదుపు ఖాతా తెరిచేందుకు ఆయా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రతి విద్యార్థీ జన్‌ధన్ ఖాతా కలిగి ఉండాలని చెప్పారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, లీడ్ బ్యాంకు ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో అకౌంట్లు తెరిచేందుకు బ్యాంకు సిబ్బందికి సహకరించాలని సూచించారు. అకౌంట్ ఓపెనింగ్‌కు విద్యార్థి ఆధార్ కార్డ్, తల్లి లేదా తండ్రి ఆధార్, ఓటర్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు, మొబైల్ నంబర్ సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. బ్యాంకు కార్యాలయంలోనే కాకుండా అన్ని ఖాతాదారుల సేవా కేంద్రాల్లోనూ ఈ అకౌంట్లు తెరుస్తారని తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే ఆయా పాఠశాల పనివేళల్లో స్కూల్ ఆవరణలో కూడా ఓపెన్ చేసే అవకాశాన్ని ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ కల్పించారని వివరించారు. ఈ నెల 15లోగా అన్ని పాఠశాలల్లో శత శాతం అకౌంట్లు తెరవాలని ఆదేశించారు.

ఎమ్‌పిలు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపని ఎమ్‌పిలు వెంటనే రాజీనామా చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె.దయానంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీలు, పోలవరానికి నిధులు పెంపు, రైల్వే జోన్‌పై బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం ఎంత అన్యాయంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టమైందన్నారు. ఇంత అన్యాయం జరిగినా ఎమ్‌పిలు మౌనం వహించడం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. రాష్ట్రంలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు కేవలం అధికారం కోసం విమర్శించుకుంటున్నాయే తప్ప కేంద్రాన్ని మాత్రం ప్రశ్నించే ధైర్యం చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ, జిల్లా ట్రెజరర్ పి.సురేష్, జగన్, అప్పారావు, జగ్గారావు, సన్యాసమ్మ, శివాజీ పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యాన విశాఖలో చేపట్టిన యాత్ర శుక్రవారం కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. అంబేద్కర్ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలి రూపాయి విలువ పడిపోయినప్పుడు దాన్ని దృష్టిలో పెట్టుకొని భారతదేశంలో ఆర్థిక వ్యవస్థ ప్రతిష్ట చేయడం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1934లో ఆర్‌బిఐని ఏర్పాటు చేసి 1935 ఏప్రిల్ ఒకటి నుండి అమల్లోకి తెచ్చిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో భానుమూర్తి, ఆదాడ మోహన్‌రావు, పాండ్రంగి వెంకటరమణ, మల్లన సంతోష్, గంటా వీర్రాజు, గొడ్డు శంకర్, చందక నూకరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే జనవాణి


గ్రామంలో పర్యటిస్తున్న నాగమాధవి, కార్యకర్తలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే మన ఊరిలో జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన నియోజకవర్గ నాయకులు లోకం నాగమాధవి తెలిపారు. శుక్రవారం మండలంలోని చౌడువాడ పంచాయతీలో జనసేన ఆధ్వర్యంలో మన ఊరిలో జనవాణి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుళాయిల ద్వారా నీరు రావడం లేదని, రీసుపేటకు దశాబ్దకాలంగా రహదారి సౌకర్యం లేదని, గర్భిణులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు వాపోయారు. కృష్ణాపురం కూడలి నుంచి చౌడువాడ వరకు బస్సు సౌకర్యం లేదని విన్నవించారు. కనీసం వీధి దీపాలు కూడా లేవని తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం కొండల్లో స్థలాలను కేటాయించారని, ఆ భూములు గృహ నిర్మాణానికి అనుకూలం కాదని గ్రామస్తులు తెలిపారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంత వరకు బిల్లులు మంజూరు కాలేదని వాపోయారు. సమస్యలపై పోరాటం చేసి పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు.

విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస


విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నవీన్

మండలంలోని చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారామ పాత్రుడు (నవీన్) పుట్టినరోజు వేడుకలను విద్యార్థుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాకిన శివనారాయణ గాంధీ, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ పల్లా రామయ్య, వైస్ సర్పంచ్ గొలగాని కనకేష్, రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, తెలుగు యువత విశాఖ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి విరోతు శివాజీ, సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, గొంప దుర్గా ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలను ఢీకొన్న జీప్

ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వేపాడ

ద్విచక్రవాహనాలను జీప్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చిన్నగుడిపాల కూడలిలో శుక్రవారం చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం ప్రకారం.. కొత్తవలస నుంచి దేవరాపల్లి వెళ్లే మార్గంలో రెండు బైక్‌లను జీప్ ఢీకొంది. దీంతో చిన్నగుడిపాల గ్రామానికి చెందిన బాలిబోయిన సన్నిబాబు (52) అక్కడికక్కడే మృతిచెందాడు. భరతవానిపాలేనికి చెందిన సిహెచ్ లక్ష్మణ్, గండి సంజీవరావుతోపాటు సన్నిబాబు భార్య దేవుడమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను సమీపంలోని కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు.

ప్రజల సంతోషమే లక్ష్యం : కడుబండి

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎగువ ఎర్రవానిపాలెం లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు, ఎఎంసి. వైస్ చైర్మన్ బొంతుల వెంకటరావు, వార్డు సభ్యులు బాలరాజు, మిందివలస రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొంత పనులకు మున్సిపల్ ఉద్యోగులా? : టిడిపి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ ఉద్యోగులను సొంత అవసరాలకు వినియోగించుకోవడం ఎంతవరకు సబబని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ప్రశ్నించారు. కోటలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల పక్షాన నిరంతరం పని చేస్తున్న బేబినాయనను విమర్శించే హక్కు వైసిపికి, మున్సిపల్ చైర్మన్ సావు మురళికి లేదన్నారు. బేబినాయన మున్సిపల్ చైర్మన్‌గా పని చేసే సమయంలో ఆరోగ్యం బాగోకపోవడం వల్ల కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాలేదని తెలిపారు. ఆ సమయంలో కాపు సామాజిక తరగతి నుంచి వైస్ చైర్మన్‌గా ఉన్న గునాన విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించారని గుర్తుచేశారు. బొబ్బిలి మున్సిపాలిటీలో కాపులకు ప్రాధాన్యత ఇచ్చింది బేబినాయన అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు 8 గ్రామాలకు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దాసన్నపేట 11కె వి ఫీడర్ మరమ్మత్తు పనులు చేపడుతున్నందున శనివారం విజయనగరం మండల పరిధిలో దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, పినవేమలి, రాకోడు, సారిక, కోరుకొండపాలెం, కోరుకొండ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఇ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలు ప్రజలు సహకరించాలని కోరారు.

పన్ను వసూలు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఇఒపిఆర్‌డి సిహెచ్.సూర్య నారాయణ.. సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని ముకుందపురం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి అనుమతి లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. సిబ్బందిపై ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక కెజిబివిలో ఆశ్రయం పొందుతున్న ముగ్గురు అనాథ పిల్లలకు భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన యువత ఆర్థిక సాయం అందించారు. రూ.75 వేలను కెజిబివి ఎస్ఒ చేతుల మీదుగా అందజేశారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. 11/2022

Between:
Bugatha Parameswara Rao ...Petitioner
AND:
Appurubugatha Sundarayya and others ...Respondents

NOTICE TO RESPONDENT NO.1 TO RESPONDENT No.10

Hearing date: 24-02-2023.

1. Appurubugatha Sundarayya, son of Jagannadham, aged 32 years, Bussiness, resident of Butchanna Koneru, Vizianagaram.
2. Avanapu Chinna, father's name not known, aged 38 years, resident of Nalla Veedhi, Vizianagaram.
3. Boni Babji, father's name not known, aged about 45 years, resident of East Balji Street, Vizianagaram.
4. Donka Madhavi, wife of late Govinda Rao, aged about 35 years, resident of Mamidipalli Village, Saluru Mandal, Vizianagaram District.
5. Bugatha Parvathi, wife of Appala Naidu, aged about 58 years, resident of Nagavamsam Street, Vizianagaram.
6. Kantubhukta Ganesh, son of Appala Raju, aged about 26 years, resident of Butchanna Koneru, Vizianagaram.
7. Boni Balaram, father's name not known, aged about 26 years, resident of Avanapu Stareet, Vizianagaram.
8. Pilla Aswini, father's name not known, aged about 33 years, resident of Hukumpeta, Vizianagaram.
9. Pilla Prasad, father's name not known, Hindu, aged about 25 years, resident of Hukumpeta, Vizianagaram.
10. Yetcherla Easwara Rao, father's name not known, aged about 52 years, resident of Butchanna Koneru, Vizianagaram.

ఇందు మూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా మరియు విజయనగరం టౌన్, బుచ్చెన్నకోనేరు కాపురస్తులు బుగతరమణగారి కుమారుడు బుగత పరమేశ్వరరావుగారు తనకున్న అప్పులు చెల్లించ శక్తిలేనివాడనని తీర్పుచేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణకల్పించమని శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో I.P.No.11/2022 పిటిషను దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల స్వయముగాగాని లేదా వకీలుగారి ద్వారా గాని **తే 24-02-2023దిన ఉదయం గం॥10-30ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెనని, లేని పక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈపత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

CH. PRAVEEN RAJU
Advocate, Narayanam Residency,
Balaji Nagar, VIZIANAGARAM
Mobile No. 9966896047.